# మిసెస్ రామనాథమ్



"మేము సికింద్రాబాద్ నుంచి ఫోను చేస్తున్నాము. నవంబరు 19న మా క్లబ్ వార్షికోత్సవం. మీరు ముఖ్య అతిథిగా విచ్చేసి మా సభను జయప్రదం చేయాలి!" పొద్దుటే ఓ ఫోను.

ఎక్కడో ఆ గొంతు విన్నట్లు అనిపించింది. కాని గుర్తుపట్టలేకపోయాను.

"మీరు ...."

నా మాట పూర్తి కాకుండానే అవతలి కంఠం-

"మద్రాసు వెళుతుంటే మనం రైల్లో కలిశాం కదండీ! నేను మిసెస్ రామనాథమ్."

"ఓ..! మీరా!" నా గొంతులో ఆశ్చర్యం.

"మీకు ఆశ్చర్యంగా ఉందా! నన్ను చూస్తే మీకలా అనిపించి ఉండవచ్చు! నాకు మాత్రం అలా అనిపించలేదు. ఆ రోజు మీతో మాట్లాడిన కాసేపట్లోనే మీరు నాకు ఆత్మీయుల్లా అనిపించారు. అందుకే చనువుగా..."

మధ్యలో అందుకుని "... ఫోను చేశారు! అంతేనా?" నవ్వుతూ అన్నాను.

ఆవిడ కూడా పకపకా నవ్వారు.

అది స్వచ్ఛమైన నవ్వు. మనసు లోతుల్లోంచి వచ్చిన పాల నురుగుల్లాంటి నవ్వు! నా హృదయాన్ని ఆకట్టుకున్న సంతోషపు జల్లు!

"ఇంటికి వచ్చి పిలవలేదని ఏమీ అనుకోకండీ! ఆహ్వాన పత్రికలు రాగానే పట్టుకొచ్చి ఇస్తాము. మీరు తప్పకుండా రావాలి!"

"మీరు అన్నిసార్లు చెప్పాలా? ఎన్ని పనులున్నా తప్పకుండా వస్తానమ్మా!"

ఆవిడ పక్కనున్న సెక్రెట్రీ కూడా మరోసారి, "తప్పకుండా మీరు రావాలి మేడమ్!" అనగానే-

"మీరు అన్నిసార్లు చెప్పాలా? తప్పకుండా వస్తానని చెప్పా కదమ్మా..!" అన్నాను.

"థాంక్యూ... మేడమ్! థాంక్యూ! ఆహ్వాన పత్రికలు రాగానే మీ దగ్గరకు వస్తాం!" మరోసారి చెప్పి వాళ్ళు ఫోను పెట్టేశారు.

ఆరోజు నేను పని మీద చెన్నై వెళుతున్నాను. నా బెర్తు చూసుకొని సామాన్లు సర్దుకుని కూర్చున్నాను.

అంతలో... ఓ దంపతులు కంపార్టుమెంటులోకి ఎక్కారు.

నా బెర్తు పక్కనే వారి బెర్తులు.

టీసీ వచ్చాక తెలిసింది- ఇద్దరివీ పైబెర్తులే అని. ఆయనకు కొంచెం వంట్లో బాగులేనట్టుంది. టీసీ ఆయనకు కింద బెర్తు ఎలాట్ చేశాడు. ఆ దంపతులు సామానులు, బెర్తులు సర్దుకునే హడావిడిలో ఉన్నారు.

నాంపల్లి స్టేషన్ నుంచి రైలు 5 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరింది.

రైల్వేవాళ్ళకి అదేమంత పెద్ద ఆలస్యంగా అనిపించదు. నాతో తెచ్చుకున్న ఒక పత్రిక తీసి తిరగెయ్యడం మొదలుపెట్టాను.

రైలు వేగంగా వెళుతుంటే కిటికీ పక్కన కూర్చుని చదవడం చాలా సరదా. అందులోనూ ఎగిరే పిట్టలను, పరుగులెత్తే చెట్లను మధ్యమధ్యలో చూస్తూ పత్రిక చదవడం

నాకు మరింత సరదా! అందులో సంధ్యాసమయంలో ఎర్రని సూర్యబింబం అపరాత్రి వెనుకకు వెళుతుంటే బంగారుకాంతులతో వెలిగే ఆకాశం, చెట్లు, చేమలు, నదులు, సముద్రాలు చూడ్డం మరెంతో ఇష్టం! కానీ, ఈ ఎ.సి. కంపార్టుమెంటులో ఆ అవకాశమే లేదు.

అడ్డుగా నిలబడిన నల్లటి కిటికీ అద్దాలవైపు ఒక్కసారి చూసి దృష్టి మరల్చుకున్నాను. సృష్టిలోని అందాన్ని మనసారా ఆస్వాదించడానికి ఎన్ని ఆటంకాలో! అందులో సగం మానవ నిర్మితాలే... అనిపించింది.

కంపార్టుమెంట్‌లో లైట్లు వెలుగుతున్నాయి. అందరూ టిఫిన్లు. భోజనాలు చేసే హడావిడిలో ఉన్నారు. నేను ఒక పండు తిని ఒక కప్పు కాఫీ తాగాను.

ఆ కంపార్టుమెంటులో అంతమంది ఉన్నా, నా దృష్టి ఎందుకో మధ్యమధ్యలో ఆ దంపతుల వైపే వెళుతోంది.

ఇద్దరూ బాక్సుల్లో తెచ్చుకున్న ఫలహారాలు తినడం పూర్తి చేసినట్టున్నారు. ఆవిడ స్టీలు గిన్నెలు కడిగి తెచ్చి బట్టతో తుడిచి తిరిగి బ్యాగ్‌లో సర్దింది. తర్వాత ఆయన పక్క సరిచేసి తలగడ సరిగ్గా పెట్టింది.

'ఇంటి పనుల మీద చాలా బాధ్యత ఉన్న ఇల్లాలు కాబోలు..!' అనుకున్నాను.

ఆయన పడుకోగానే రగ్గు కప్పి ఆవిడ నా పక్కగా వచ్చి కూర్చున్నారు. నేను నా చేతిలో వారపత్రిక పక్కకు పెట్టాను.

"మీరు చెన్నై వరకా?"

నేను– "అవును" అనగానే, ఆవిడ– "మేము కూడా అక్కడికే!" అంది.

"అక్కడ మా అమ్మాయి, అల్లుడు ఉన్నారు. ఎల్లుండి మా మనవరాలు పుట్టిన రోజు! ఆ పిల్ల మా దగ్గర చాలా చనువు! కావలసిన వాళ్ళని చూసిన సంతోషంలో ఆయన ఆరోగ్యం కాస్త కుదుటపడవచ్చు. పైగా... కొత్త డాక్టర్లకి చూపించవచ్చు కదా! అందుకే వెళుతున్నాం!"

ఆవిడ మాటల్లో ఏదో ఆకర్షణ ఉంది. చెప్పడం కూడా ఎదుటివాళ్ళు వినేటట్టుగా ఉంది.

"అలాగా" అన్నాను చిరునవ్వుతో.

"మా అబ్బాయి గ్వాలియర్లో ఉన్నాడు. ఇక్కడకి చాలా దూరం! వాళ్ళే వచ్చి వెళుతుంటారు" అంది తిరిగి ఆవిడే!

"మీరు హైదరాబాద్‌లో ఎక్కడుంటారు?" ఆవిడే అడిగింది.

"హిమాయత్‌నగర్‌లో ఉంటాం! మరి, మీరెక్కడుంటారు?" అదే నా మొదటి ప్రశ్న.

"మేము సికింద్రాబాద్ లాలాగూడా క్వార్టర్స్‌లో ఉంటాము."

"అక్కడ మీకు... అంటే ఆడవాళ్ళకి కాలక్షేపం బాగుంటుందా?"

"అబ్బో... ఆడవాళ్ళకి కావలసినంత కాలక్షేపం! లేడీస్ క్లబ్‌లున్నాయి. రకరకాల ఆటలు, కుట్లు, అల్లికలు, వంటలు, ఎన్నో ట్రైనింగ్‌లు, పైగా... పోటీలు! క్వార్టర్స్‌లో ఉన్నవాళ్ళం కలుసుకుంటూ ఉంటాం! మధ్యమధ్యలో అందరం కలిసి విందులూ, వినోదాలు కూడా ఏర్పాటు చేసుకుంటాం!"

"అయితే- మీకు కాలక్షేపం బాగానే ఉన్నట్టుంది!" అన్నాను నవ్వుతూ.

"ఆc... లేడీస్ క్లబ్‌కి ప్రస్తుతం నేను ప్రెసిడెంటుగా సెలక్టు అయ్యానండి! మా సెక్రెటరీ కూడా చాలా చురుకైంది. మేము అనాథాశ్రమం నడుపుతున్నాం. పిల్లల కేర్‌సెంటర్ పెట్టాం! బాగా రన్నవుతున్నాయి. మా కల్చరల్ ప్రోగామ్స్‌కి ఆడవాళ్ళే కాదండీ- మగవారు, ముసలివారు, పిల్లలు... అందరూ వస్తారండి!"

"అయితే... ఆ కాలనీ మీకో మినీ ప్రపంచమన్నమాట! మీ పనే బాగుందండీ!"

ఆమె కిలకిలా మరోసారి నవ్వింది. తెల్లటి ముత్యాల్లాంటి ఆమె పళ్ళు, నల్లటి కోలకళ్ళు, సన్నటి ముక్కు మరింత సొగసుగా ఉన్నాయి. ఛాయ తక్కువైనా మనిషి ఆకర్షణీయంగా ఉంది.

"మా పని బాగానే ఉంది. ఏదో ఇంటి పట్టున ఉండేవాళ్ళం! మీరేం చేస్తారో చెప్పలేదు?"

"నేను మా సొంత బిజినెస్ చూసుకుంటాను."

"ఓc... అలాగా! మా క్వార్టర్స్‌లోనే మావారి కొలీగ్ భార్య యూనివర్సిటీలో పని చేస్తారు. ఆవిడ జయాసారథి. చాలా ధైర్యస్థురాలండీ! ఆడవాళ్ళంతా స్వతంత్రంగా ఆలోచించే శక్తి ఉంచుకోవాలనీ, తమ కాళ్ళ మీద తాము నిలబడేవరకు ఎదగాలనీ ఎన్నో చెప్పేవారు. ఇప్పుడామె మా క్వార్టర్స్‌లో లేరు! బయట ఇల్లు కట్టుకుని వెళ్ళిపోయారు! ఆవిడ వెళ్ళాక నాకు సగం శక్తి తరిగిపోయిందనుకోండీ..!"

"ఓc...! జయాసారథిగారా! నాకు బాగా తెలుసండి! ఆవిడ చాలా ఉన్నత భావాలుగల వ్యక్తి. ఆవిడ చెప్పినట్టు మన ఆడవాళ్ళు బాగా మారాలి కదండీ! మగవారిని ఎదిరించమని, వారిని కించపరచమని కాదు.., స్వతంత్ర భారతంలో స్త్రీ, పురుషుల స్థానం సమానమైందే కదా! పైగా... బండికి ఇరుచక్రాల వంటివారు! హెచ్చుతగ్గులు తాత్కాలికం!

భేదాలు సృష్టించుకోవడం అవివేకం. కాని, మన ఆడవాళ్ళకి ఏ అన్యాయం జరిగినా, అవమానం జరిగినా సహించకూడదు. స్త్రీని లోకువగా చూసినా, హేళన చేసినా ఏమాత్రం ఊరుకోకూడదు!"

"ఆవిడా ఇలాగే చెప్పేవారు! కాని, సగం మంది స్త్రీలు ఎక్కువ చదువుకోకపోవడం వల్ల, ఇంట్లో వంటిల్లుకు అతుక్కుపోయి వండుతూ, వారుస్తూ, వడ్డిస్తూ ఉండటం వల్ల కూడా కొంత లోకువై ఉండవచ్చండీ!" అంది.

ఆవిడ మాటల్లో ఏదో అమాయకత్వం కనబడింది.

"మీరు చెప్పింది నిజమే! ఆడవాళ్ళకి ఏమీ తెలీదని చాలామంది అపోహ! అందుకే ప్రభుత్వం తరపున కాని, ప్రైవేటుగా కాని ఏవైనా అవకాశాలు వస్తే ఏదో ఒకర్ని పిలిచి సర్దుబాటు చేసి చేతులు దులుపుకుంటారు. నిజమే కదా?"

"ఎంత కరెక్టుగా చెప్పారండీ! స్త్రీలకి పురుషులతో సమానమైన రోజులు ఎప్పుడొస్తాయంటారు?"

"ఇంకెంత? ఆ టైము వచ్చేసిందండీ! మొదటి మెట్టుమీద ఉన్నారు. ఒక్కొక్క మెట్టే ఎక్కేస్తారు. ఎంతో కాలం పట్టదు!" అన్నాను.

సంతోషం పట్టలేక ఆవిడ గట్టిగా చప్పట్లు కొట్టింది. పడుకున్నవాళ్ళు తలతిప్పి చూడగానే ఆవిడ చప్పట్లు కొట్టడం ఆపి, నాలిక కరుచుకుంది!

టైం చూస్తే అప్పటికే పదయింది.

"జయాసారథిగారు కనబడితే అడిగానని చెప్పండి! ఇంక పడుకుందామా..?"అంది

"అలాగే... ఆవిడ కనబడితే చెబుతా! కాని, మీ పేరు నాకు తెలీదు కదా!" అన్నాను నవ్వుతూ.

"మిసెస్ రామనాథమ్! అలా చెప్పేస్తే ఆవిడకు తెలుస్తుంది" అలా అంటుంటే ఆవిడ ముఖం వాడిపోవడం నేను గమనించాను.

ఆవిడ పైబెర్తు మీదికి వెళ్లి పడుకున్నారు.

బ్లూ బెడ్‌లైట్ సన్నని కాంతిలో మెత్తని రగ్గు కప్పుకుని నేను కూడా నిద్రలోకి జారుకున్నాను.

మేము తెల్లవారాక ఎక్కువ మాట్లాడుకోలేదు.

చెన్నై సమీపిస్తోంది.

సామానులన్నీ సర్దుకుని రెడీగా ఉన్నాం! ఆవిడ నా అడ్రస్సు అడగలేదు. నేను ఆవిడనీ అడగలేదు.

స్టేషన్ రాగానే-

"వస్తానండీ!" అంటూ ఆవిడ భర్త వెంట సామానుతో నడిచింది.

సామాను తీసుకుని నేను దిగాను.

తర్వాత ఆవిడ నాకు అప్పుడప్పుడు ఎందుకో జ్ఞాపకం వస్తూనే వుంది.

మా ఇద్దరి మధ్యా జరిగిన సంభాషణాప్రభావం కాబోలు... "ఆవిడ పేరు మిసెస్ రామనాథమ్!" అన్నప్పుడు ఎందుకు ఆవిడ ముఖం వాడిందో! ఆవిడకు అసలు పేరు ఉండాలి కదా! ఎందుకు చెప్పలేదు?

ఈ ప్రశ్నలకు మాత్రం ఎంత ఆలోచించినా సమాధానం దొరకలేదు. తర్వాత ఆ విషయాన్ని నేను అంతగా ఆలోచించలేదు.

ఫంక్షన్ ఓ రోజుందనగా... మిసెస్ రామనాథమ్ ఆహ్వాన పత్రికలతోపాటు సెక్రెట్రీని కూడా వెంటబెట్టుకుని నా దగ్గరకు వచ్చారు.

వాళ్ళుండగానే ఆహ్వాన పత్రికలు కవర్లోంచి తీసి చూశాను. కింద పేర్లు చూసి నాకు ఆశ్చర్యం కలిగింది.

"ఇదేమిటండీ... మీరు ఇంత మంచిపేరు పెట్టుకుని ఆరోజు నాకెందుకు చెప్పలేదు?" ఆశ్చర్యం, కోపం మిళితమైన స్వరంతో అడిగాను.

"ఆ పేరు వాడుకలో లేనప్పుడు చెప్పడం దేనికి? చెప్పినా ఎవరికర్థమవుతుంది? అందుకే చెప్పలేదు."

"అంటే..?" ఆవిడ మాటలు అర్థంకాక అడిగాను.

"మా తల్లిదండ్రులు 'చందన' అని ఎంతో అందమైన, మృదువైన పేరు పెట్టారు. అందరూ నన్నీ పేరుతో పిలుస్తుంటే నా ఒంటినిండా చందనం పరిమళిస్తున్నట్టు అనిపించేది. పెళ్ళై అత్తవారింటికి వచ్చాక మా అత్తింట్లో అందరూ 'ఏమే, ఒసే, కోడలుపిల్లా...' ఇవే పేర్లు ఖాయం చేశారు. మావారు కొత్తలో 'చందనా' అని పిలిస్తే మురిసిపోయాను. తర్వాత ఆయన కూడా ఏ గూటిచిలక ఆ గూటి పలుకే పలుకుతుందన్నట్టు- 'ఏమి, ఒసే, మొద్దూ, ఏమోయ్...' అంటూ అలవాటు చేసుకున్నారు. ఊళ్లో అందరూ మిసెస్ రామనాథమే సార్థకం చేశారు. నా పేరు వాడుకలోంచి పోయింది. నేనే కాదు, మా క్వార్టర్స్‌లో అందరి పేర్లూ అంతే! ఈవిడ మా సెక్రెట్రీ! ఈవిడ 'మిసెస్ రావు!" అంది. అలా చెబుతుంటే ఆవిడ కళ్ళల్లో నీళ్లు తిరిగాయి.

"మరిప్పుడెందుకు మీ పేర్లు వేసుకున్నారు?"

"క్వార్టర్స్‌లోకి ఎంతోమంది కొత్తవాళ్లు వచ్చారు. కనీసం వాళ్ళకైనా మా అసలు

పేర్లు తెలుస్తాయని! పైగా... పిల్లలు కూడా 'నీ పేరేమిటమ్మా?' అంటూ రోజూ ప్రాణం తీస్తున్నారు."

"అందుకని... ఇన్నాళ్లు ఈ ధైర్యం ఎందుకు చెయ్యలేకపోయారు?"

"అవకాశం రాలేదు! ఇప్పుడు మేము కాస్త పదవుల్లో ఉన్నాం కదా... అవకాశం వచ్చింది!"

"దేనికైనా ధైర్యం చెయ్యాలి! ఇప్పటికైనా ఆ పని చేశారు... సంతోషం! ఇంక వెళ్లి రండి!" అన్నాను వాళ్ళ భుజాలు తట్టి.

"నమస్తే మేడమ్..!" అంటూ ఇద్దరూ బయలుదేరి వెళ్లారు. ఇప్పుడు నాకు వాళ్ళ బాధ పూర్తిగా అర్థమయింది.

ఆరోజు ఆలస్యం కాకుండా సమయానికి ఫంక్షన్ హాలు చేరుకున్నాను.

అప్పటికే క్వార్టర్స్‌లోని జనంతో హాలంతా నిండిపోయింది. ఆ క్లబ్‌కి ఎంతో సహాయం చేస్తున్న 'రజనీ' గారు సభకు అధ్యక్షత వహించారు.

"మిసెస్ రామనాథంగారు, మిసెస్ రావుగారు చాలా పట్టుదల, తెలివిగలవారు. ఎంతో కృషి చేసి ఈ క్లబ్ నడుపుతూ ఇంత పైకి తీసుకువచ్చారు? మిసెస్ రామనాథమ్, మిసెస్ రావుల మూలంగానే అనాథాశ్రమం, కేర్‌సెంటర్ ఎంతో జాగ్రత్తగా చూస్తున్నాం" అంటూ మాటకు ముందు వారి పేర్లను పొగుడుతూనే ఉన్నారు.

స్త్రీలంతా పళ్లు నూరుకుంటున్నారు. మిగతావారు పట్టించుకున్నట్టే లేదు. ఎవరి గోలలు వారివి!

తర్వాత నన్ను మాట్లాడమన్నారు.

నేను మైక్ దగ్గరకు వచ్చాను–

"ఈగ ఇల్లలుక్కుంటూ పేరు మర్చిపోయిందట. అలాగే పెళ్ళై ఈ క్వార్టర్స్‌కు వచ్చిన ఆడవాళ్ళంతా వారి పేర్లు వారే మర్చిపోయారు. ఊళ్లోవాళ్ళకి వాళ్ళ భర్తపేర్లే వారి పేర్లు! తల్లిదండ్రులు ఎంతో ముద్దుగా 'చందనా' అని పేరు పెడితే భర్త, అత్త, ఆడబిడ్డా ఆపేర్లతో పిలిస్తే ఎంత బాగుంటుందో చెప్పండి? ఏమైనా డబ్బు ఖర్చా? పరువు నష్టమా? నేనడం కాదు... మీరే చెప్పండి? ఊళ్ళోవాళ్ళంతా ఆమె పేరును తీసేసి భర్త పేరే ఆమెకు ఖాయం చేస్తే ఎలాగండీ? అది తారుమారై భర్త పేరుకు బదులు భార్య పేరు తగిలిస్తే ఎంత అసహజంగా ఉంటుంది? కనీసం ఇంట్లో పెంచే కుక్కలకి, పిల్లులకి కూడా పేర్లు పెట్టుకుని ముద్దుగా పిలుచుకుంటాం! మొన్న హైదరాబాద్ జూలో చనిపోయిన పులిపిల్ల 'సాకీ' పేరు తెలియని వారున్నారా? స్త్రీలని ఉద్ధరించాలంటే ముందు వారిపేర్లతో వాళ్ళని

బతకనీయండి. మీకిదే నా ప్రార్థన!" నా ఉపన్యాసం ముగించాను.

హాలంతా చప్పట్లతో ప్రతిధ్వనించింది.

చందన, సుందర్‌ల ముఖాలు దివిటీల్లా వెలిగాయి.

కొత్తగా క్వార్టర్స్‌లోకి వచ్చిన ఆడవాళ్ళందరూ వచ్చి "మమ్మల్ని ముందే హెచ్చరించినందుకు చాలా సంతోషమండీ!" అన్నారు.

"మా అమ్మ చందన, చందన..." అంటూ ఆ తల్లిని పిల్లలు చుట్టుముట్టారు.

ఆ మహిళ నవ్వుతో నా హృదయం స్వర్ణ కమలమయింది.

ఎప్పుడైనా "మిసెస్ రామనాథమ్!" గుర్తుకు రాగానే నవ్వుకుంటూనే ఉన్నాను.

- *'ఆంధ్రజ్యోతి'* వార పత్రిక... *10 నవంబర్, 2000*